సాక్షి
జగిత్యాల

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023

న్యూస్‌రీల్

భూరికార్డుల భద్రతకు బడ్జెట్ ప్రతిపాదనలు

సాక్షి ఎఫెక్ట్..

జగిత్యాల: జిల్లాలోని భూ కొలతల శాఖలో రికార్డులను ఓ గదిలో నిర్లక్ష్యంగా పెట్టడంతో ఈనెల 22న 'సాక్షి' 'నిలువెల్ల నిర్లక్ష్యం' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై అధికారులు స్పందించారు. భూ రికార్డులను భద్రపర్చేందుకు ర్యాకుల ఏర్పాటు చేసేలా బడ్జెట్ కోసం ప్రతిపాదనలు రూపొందించారు. ర్యాకులకు రూ.3,36,600 ఖర్చవుతాయని నివేదించారు. కలెక్టర్ అనుమతి పొందగానే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని భూ కొలతల శాఖ ఏడీ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఎస్సారెస్పీ 13 గేట్ల ఎత్తివేత



గేట్లను ఎత్తడంతో గోదావరిలోకి దూకుతున్న ఎస్సారెస్పీ నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద వస్తుండటంతో ప్రాజెక్టు 13 గేట్లను ఎత్తి గోదావరిలోకి వదిలారు. గోదావరి నదిలోకి వెళ్లే మత్స్యకారులు, గేదెల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.0 అడుగులుగా ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 61,930 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో అదేస్థాయిలో దిగువకు వదులుతున్నారు. 13 గేట్ల ద్వారా 40,612 క్యూసెక్కులు, కాకతీయ మెయిన్ కాలువకు 6 వేల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తికి 2వేల క్యూసెక్కులు, లక్ష్మీ కెనాల్‌కు 200 క్యూసెక్కులు, సరస్వతి కెనాల్‌కు 300 క్యూసెక్కులు, వరద కాల్వకు 12 వేల క్యూసెక్కుల చొప్పున వదులుతున్నారు.

లడ్డూ అ'ధర'హో..



లడ్డూలతో షోరవ్ దంపతులు

జగిత్యాలటౌన్: లంబోదరుడి లడ్డూలకు బుధవారం వేలం నిర్వహించారు. వెలమ సంఘం గణపతి మండప లడ్డూను రాంపూర్‌కు చెందిన షోరవ్ దంపతులు రూ.1.62 లక్షలకు దక్కించుకున్నారు. అష్టలక్ష్మి గణపతి ఆలయంలోని లడ్డూను చిన్నప్పరెడ్డి నరసింహులు రూ.1.25 లక్షలకు దక్కించుకున్నారు. జగిత్యాల బార్ అసోసియేషన్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూను రూ.27 వేలకు బార్ అసోసియేషన్ సభ్యుడు, హైకోర్టు న్యాయవాది కొండపల్కల సాయి శృతిన్‌రావు దక్కించుకున్నారు.

రాయికల్: పట్టణంలోని సంఘమిత్ర యువజన సంఘం గణనాథుని లడ్డూను బుధవారం వేలం వేయగా రూ.28,001కు పటేల్ శ్రీకాంత్ రెడ్డి దక్కించుకున్నట్లు అధ్యక్షుడు పాలడుగు రంజిత్‌రెడ్డి తెలిపారు. కోరుట్లలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో వినాయకుడి లడ్డూకు రూ.54వేలు పలికింది.

బీఆర్ఎస్‌తోనే గ్రామాలు అభివృద్ధి



శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: గ్రామాల్లో సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ కట్టుబడి ఉందని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని రాయపట్నం, కమలాపూర్, పెద్దనక్కలపేట, దుబ్బలగూడెం, కోస్నూర్‌పల్లెలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రాయపట్నంలో రూ.40 లక్షలతో ఫార్మేషన్ రోడ్డు, కమలాపూర్‌లో రూ.1.10 కోట్లతో కమలాపూర్ నుంచి బందం మాటు వరకు రోడ్డు నిర్మాణం, రూ.17 లక్షలతో మున్నూరుకాపు, గౌడ సంఘాల భవనాలు, రూ.27 లక్షలతో సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 500 కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అన్ని వర్గాలకు ప్రభుత్వం పథకాలు అందిస్తూ.. వారి జీవన విధానంలో మార్పులు తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. జైనాకు చెందిన శివకుమార్‌కు రూ.లక్ష విలువైన ఎల్‌వోసీని అందించారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులున్నారు.



నిమజ్జనం వేడుకల్లో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



జిల్లాకేంద్రంలోని టవర్‌ప్రాంతం నుంచి శోభాయాత్రగా తరలుతున్న గణనాథులు, మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

బైబై గణేశా..



ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నృత్యాలు



కోరుట్ల: పట్టణంలోని శివ్వశేనా యూత్ ఆధ్వర్యంలో నిమజ్జన వేడుకల్లో ఆకర్షణగా నిలిచిన బ్యాండ్

జగిత్యాలటౌన్/రాయిల్: గణేశ్ నిమజ్జనాన్ని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలో మొదటి రోజు దాదాపు 250 వినాయకులను నిమజ్జనం చేశారు. పట్టణంలోని విద్యానగర్, విజయపురి, చిలుకవాడ, అరవింద్‌నగర్, హౌజింగ్‌బోర్డు, భాగ్యనగర్ నుంచి బయల్దేరిన గణనాథులు.. పాతబస్టాండ్, యావర్‌రోడ్, కొత్త బస్టాండ్, టవర్‌మీదుగా చింతకుంట చెరువులో నిమజ్జనం చేశారు. శోభాయాత్రలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గోలీ శ్రీనివాస్ పాల్గొన్నారు. నిమజ్జనం జరిగే చింతకుంట చెరువు వద్ద భారీ లైటింగ్, పోలీసు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



చెరువులో గణపయ్యల నిమజ్జనం



నిమజ్జనానికి బయల్దేరిన చిన్న వినాయకుడు



నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు



శోభాయాత్రలో మహిళల కోలాటం



రాయికల్: కోలాటం ఆడుతున్న పద్మశాలీ మహిళలు



రాయికల్: మంగళహారతులతో ఆర్యవైశ్య మహిళలు

బల్దియాలకు నిధుల జాప్యం

- పండగపూట పాలకవర్గం ఇబ్బందులు
- మూడునెలలుగా నిలిచిన పట్టణ నిధులు
- 15వ ఆర్థిక సంఘం నుంచీ రాని వైనం
- జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు

రాయికల్(జగిత్యాల): జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల విడుదల ఆగిపోయింది. మూడు నెలలుగా ఇదే పరిస్థితి ఉండడంతో పాలకవర్గాలు ఇబ్బందిపడుతున్నాయి. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రతినెలా ప్రత్యేక గ్రాంట్ల కింద నిధులు విడుదల చేస్తాయి. పట్టణ ప్రగతి, 15వ ఆర్థిక సంఘం ద్వారా ఆయా మున్సిపాలిటీలకు వచ్చే నిధులతో బల్దియాల్లో అభివృద్ధి పనులు, కార్మికుల వేతనాలు చెల్లింపు వంటివి చేపడతారు. అయితే మూడునెలల నుంచి పట్టణ ప్రగతి, 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాకపోవడంతో మున్సిపాలిటీల్లో పాలన గాడి తప్పుతోంది. గణేశ్ నిమజ్జన వేడుకలతోపాటు, మరికొద్ది రోజుల్లోనే దసరా, బతుకమ్మ పండగలు ఉండడం.. మున్సిపాలిటీల్లో నిధులు లేకపోవడంతో మున్సిపల్ అధికారులు నానా తంటాలు పడుతున్నారు. అభివృద్ధి పనులు ఎలా చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన గ్రాంట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేటి వరకు విడుదల చేయకపోవడంతో జిల్లాలోని ఆదాయం అత్యంత తక్కువగా ఉన్న రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లో పాలకవర్గ సభ్యులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా ఈ నిధుల ద్వారా ఉద్యోగ వేతనాలు, విద్యుత్ బిల్లులు, రోడ్ల మరమ్మతు, మురికికాలువల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు, అత్యవసర పనులు తదితర అభివృద్ధి పనులు చేయాల్సి ఉంటుంది.



రాయికల్ మున్సిపాలిటీ

జిల్లాలోని మున్సిపాలిటీలకు ప్రతినెలా రావాల్సిన నిధులు (రూ.లలో)

మున్సిపాలిటీ	పట్టణ ప్రగతి	15వ సంఘం
జగిత్యాల	36 లక్షలు	36 లక్షలు
కోరుట్ల	24 లక్షలు	24 లక్షలు
ధర్మపురి	6 లక్షలు	6 లక్షలు
మెట్‌పల్లి	19 లక్షలు	19 లక్షలు
రాయికల్	5.60 లక్షలు	5.60 లక్షలు

పనులు చేపడుతున్నాం



మున్సిపాలిటీలకు ప్రత్యేక గ్రాంట్ల విడుదలలో జాప్యం అవుతుండటంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పాలకమండలి తీర్మానంతో పండగవేళ పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా చర్యలు చేపడుతున్నాం. గ్రాంట్ విడుదల కాగానే నిధులు సమకూర్చుకుంటాం.

– సంతోష్‌కుమార్, రాయికల్ మున్సిపల్ కమిషనర్

ఉత్సవాల వేళ... నిధుల కొరత

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో వినాయక నిమజ్జనాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపాలిటీల్లోని ప్రధాన రహదారుల్లో గుంతలు పూడ్చాల్సి ఉంటుంది. నిమజ్జనం చేసే చోట స్థలాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు, అన్ని రకాల ఏర్పాట్లు చేయనున్నారు. మరో నెల రోజుల్లో దసరా, బతుకమ్మ పండగలు రానుండడం.. మరోవైపు ఖజానా ఖాళీగా ఉండడంతో మున్సిపల్ అధికారులు సతమతం అవుతున్నారు. పండగల పూట పట్టణ ప్రగతి 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం విడుదల చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సంతానం కలగాలని గణపయ్యకు ముస్లిం పూజలు



స్వామివారి కలశంతో రహీం దంపతులు

- వినాయక విగ్రహం బహూకరణ
- నవరాత్రులూ పూజల్లో పాల్గొన్న వైనం
- కలశం అందించి దీవించిన అర్చకులు

సారంగాపూర్: బీర్‌పూర్‌లో మతసామరస్యం వెల్లివిరిసింది. తమకు వినాయకుడు సంతానం అందించాలని కోరుతూ వినాయక విగ్రహాన్ని అందించి.. తొమ్మిది రోజులు నిష్ఠగా పూజలు చేసి, నిమజ్జనం రోజు అర్చకుల నుంచి కలశం స్వీకరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు ముస్లిం దంపతులు. బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన బాబర్, నహీం, రహీం ముగ్గురు అన్నదమ్ములు. మండలకేంద్రంలో లేడీస్ ఎంపోరియం, హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. రహీంకు పెళ్లయి చాలా ఏళ్లవుతోంది. సంతానం లేకపోవడంతో అన్నదమ్ముల సూచనల మేరకు రహీం, ఆయన భార్య గ్రామంలోని పైవాడ (ఆసుపత్రి ఏరియా)లో వినాయకుడి విగ్రహాన్ని బహూకరించారు. అప్పటినుంచి తొమ్మిదిరోజుల పాటు రహీం, ఆయన భార్య, అన్నదమ్ములైన బాబర్, నహీంలు వారి కుటుంబసభ్యులతో పూజలు చేశారు. బుధవారం నిమజ్జనం సందర్భంగా స్వామివారి కలశాన్ని అర్చకులు రహీం, ఆయన భార్యకు అందించారు. అనంతరం వారు స్వామివారి నిమజ్జనంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమవీరుడు లక్ష్మణ్ బాపూజీ







నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు లత, దివాకర, నివాళులర్పిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, జెడ్పీ డెప్యూటీ సీఈవో, ఎస్పీ భాస్కర్

- అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: తెలంగాణ ఉద్యమవీరుడు కొండలక్ష్మణ్ బాపూజీ అని అదనపు కలెక్టర్ లత అన్నారు. బుధవారం కొండలక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకరతో కలిసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాపూజీ జయంతి, వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. నిబద్ధత కలిగిన గొప్ప రాజకీయ నాయకుడని, ఆయన జీవితం నేటితరానికి ఆదర్శనీయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సాయిబాబా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ, పౌరసంబంధాల అధికారి భీంకుమార్, హన్మంతరావు, హరి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

బాపూజీ సేవలు స్ఫూర్తిదాయకం

జగిత్యాలజోన్: బాపూజీ సేవలు స్ఫూర్తిదాయకమని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జెడ్పీ సీఈవో నరేశ్, జెడ్పీ డెప్యూటీ సీఈవో రఘువరన్, పీఆర్ ఈఈ రహమాన్, అధికారులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు బాపూజీ : ఎస్పీ

జగిత్యాలక్రైం: స్వరాష్ట్ర సాధనకు పరితపించి తొలి, మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, ఏవో అమర్‌నాథ్, ఆర్ఐలు జానిమియా, వేణు, సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు ఆర్ఎస్సైలు, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

దూప, దీప నైవేద్య అర్చకులకు శిక్షణ

జగిత్యాల/సారంగాపూర్: దూప, దీప నైవేద్య అర్చకులకు ఆగమములపై మూడు రోజుల పాటు శిక్షణ తరగుతులు నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ చంద్రశేఖర్, దుబ్బరాజన్న ఆలయ ఈవో అనూష తెలిపారు. వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరాస్వామి ఆలయ ప్రాంగణంలో వచ్చేనెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు శిక్షణ ఉంటుందని, అనుభవం ఉన్న పండితులతో పంచారాత్ర, శైవ, వైదికస్మార్త, వైఖానస, వీరశైవ, చాత్తాదశ్రీవైష్ణవ, గ్రామదేవత, తంత్రసార వంటి వాటిపై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.

నాచుపల్లి జేఎన్టీయూకు పాలకమండలి

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూకు అటానమస్ గుర్తింపు రాగా.. వర్సిటీ వైస్ ఛాన్సలర్ కట్టనరసింహారెడ్డి పాలకమండలిని నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ కామాక్షి ప్రసాద్ తెలిపారు. చైర్మన్‌గా ప్రొఫెసర్ ఎన్వీ.రమణారావు, డైరెక్టర్‌గా ఎన్ఐటీ (రాయిపూర్), సభ్యులుగా ప్రొఫెసర్ జి.భాగ్యనారాయణ, ప్రొఫెసర్ ఆర్.సాయన్న, ,యూనివర్సిటీ నామినిగా వెంకటేశ్వర్‌రెడ్డిని నియమించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల రాస్తారోకో



కార్మికులకు మద్దతు తెలుపుతున్న కృష్ణారావు

కోరుట్ల: ప్రభుత్వం పెంచిన రూ.3 వేల వేతనం, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని జాతీయ రహదారిపై మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం రాస్తారోకో చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు మాట్లాడుతూ 8 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవటం సరికాదన్నారు. చెన్నవేని దశరథం, మునుగోరి హనుమంతు, భాగ్య, పద్మ, తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నభోజనం, ఆశాకార్యకర్తల, అంగన్‌వాడీటీచర్ల సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు డిమాండ్ చేశారు. లేకుంటే ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఇంటిని ముట్టడిస్తామని పేర్కొన్నారు. కౌన్సిలర్ తిరుమల గంగాధర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, ఖయ్యూం, నర్సయ్య పాల్గొన్నారు.

పర్యాటక రంగంలో వెల్గటూర్ అభివృద్ధి



మంత్రికి బహుమతి ఇస్తున్న విష్ణువర్ధన్‌రావు

వెల్గటూర్: వెల్గటూర్ మండలకేంద్రం రానున్న రోజుల్లో పర్యాటక రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ నాయకుడి పెట్రోల్ బంక్‌ను ప్రారంభించారు. మండలంలోని పాశిగామ వద్ద రూ.2కోట్లతో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కోటిలింగాలలో రూ.2.5 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం, రాజగోపురం పనులు శరవేగంగా జరుగుతున్నాయని, పెద్దవాగుపై నిర్మించిన బ్రిడ్జి నుంచి కోటిలింగాల ఆలయం వరకు బోటింగ్ సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18 వేలు చెల్లించాలి

- వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ



ఆశావర్కర్లతో దీక్షలో కూర్చున్న సత్యనారాయణ

కథలాపూర్(వేములవాడ): ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేలు వేతనం చెల్లించాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. మండలకేంద్రంలో ఆశా వర్కర్లు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు సంఘీభావం ప్రకటించారు. వైద్యశాఖ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నా.. వేతనాల విషయంలో ప్రభుత్వం వివక్ష చూపడం దారుణమన్నారు. ఆశావర్కర్లకు మండల మున్నూరు కాపు సంఘం సభ్యులు సంఘీభావం ప్రకటించారు. నాయకులు గాండ్ల స్వామి, ఆకుల నర్సయ్య, జవ్వాజి ఆదిరెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లనాగలికి భలే గిరాకీ

వ్యవసాయం కొత్త పుంతలు తొక్కుతున్నా.. ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చినా సాగులో మాత్రం ఎడ్ల నాగలికి ఉన్న గిరాకే వేరు. ఆధునిక యంత్రాలతో పంటల సాగు ప్రారంభించినా.. గొర్రుకొట్టడం.. కలుపుతీతకు డౌర తోలడం వంటి పనులకు ఎడ్ల నాగలి తప్పనిసరి. అయితే గ్రామాల్లో ఎడ్లతోపాటు కూలీల కొరత తీవ్రంగా ఉంది. ఎడ్లను పోషిస్తున్న వారికి మాత్రం భలే గిరాకీ ఉంది.

- రోజుకు రూ.1500 నుంచి రూ.2వేలు
- అయినా దొరకని ఎడ్ల నాగళ్లు
- గ్రామాల్లో ఎడ్లు, కూలీల కొరత
- ఇబ్బంది పడుతున్న అన్నదాతలు



భీంరాజ్‌పల్లిలో పత్తి పంటలో డౌర కొడుతున్న రైతు

గొల్లపల్లి: ట్రాక్టర్ల వినియోగం పెరగడంతో కాడెడ్లు కనుమరుగవుతున్నాయి. చాలామంది ట్రాక్టర్‌తోనే అన్ని పనులూ పూర్తి చేసుకుంటున్నారు. ఎడ్ల నాగలితో ఒకరోజు చేసే పనిని ట్రాక్టర్ గంటలో పూర్తి చేస్తుంది. దీంతో చాలామంది రైతులు ట్రాక్టర్లతోనే వ్యవసాయం చేస్తున్నప్పటికి పత్తి మొలకెత్తిన తరువాత కలుపు నివారణ, డౌర వంటి పనులకు అరకకు డిమాండ్ పెరిగింది. దీంతో ఎడ్ల నాగలికి రోజుకు రూ.1500 నుంచి రూ.2000 వెచ్చించాల్సి వస్తోంది.

చేతినిండా పని..

ప్రస్తుతం కాడెడ్ల జతలు తక్కువగా ఉండటంతో ఏ గ్రామంలో చూసినా అరకకు డిమాండ్ పెరిగింది. పొలం పనుల్లో గొర్రు, అరకకు కాడెడ్లు వినియోగిస్తుంటారు. దీంతో పాటు పత్తిలో కలుపు నివారణ, తేమకోసం కాడెడ్లు వినియోగిస్తుండటంతో వారికి వారం, పదిరోజుల ముందే అడ్వాన్స్ ఇస్తున్నారు.

పోషించలేక..

ఒకప్పుడు ప్రతి రైతు ఇంట కాడెడ్లు, ఆవులు తప్పనిసరిగా ఉండేవి. ప్రస్తుతం ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రావడం.. పశువులను మేపేందుకు కంచెలు లేకపోవడంతో పోషణభారంగా మారింది. దీంతో రైతులు అమ్ముకొని.. వాటి స్థానంలో ఆవులను పోషించుకుంటున్నారు. ప్రస్తుతం అటవీ ప్రాంతం ఉన్న గ్రామాల్లోనే ఎడ్లు కనిపిస్తున్నాయి. మరోవైపు గ్రామాల్లో అరకతో వ్యవసాయం చేసేవారు కూడా తక్కువయ్యారు. ఒక్కో గ్రామంలో కనీసం 10 నుంచి 15 ట్రాక్టర్ల వరకు ఉంటాయి. ఒక్క గొల్లపల్లి మండలంలోనే సుమారు 300కి పైగా ట్రాక్టర్లు ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

డౌరకు ఎడ్లు తప్పనిసరి



వరి రైతులు పత్తి సాగువైపే ఆసక్తి చూపుతున్నారు. పత్తిలో గడి నివారణ, తేమ శాతం ఉండేలా చూసేందుకు కాడెడ్లతో డౌర తప్పనిసరి. నేను రెండున్నర ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్న. డౌర పూర్తయ్యేవరకూ ఎడ్ల నాగలికే సుమారు రూ.20 వేల ఖర్చువుతున్నాయి.

– రేవెల్లి రాజలింగు, రైతు, భీంరాజ్‌పల్లి

కూలీలు, డౌర ఖర్చు ఎక్కువే..



పత్తిలో కలుపు పెరుగుతుంది. కూలీల కొరత తీవ్రంగా ఉంది. డౌర కొట్టాలంటే ఎడ్లు తప్పనిసరి. మహిళా కూలీలకు రోజుకు రూ.250 వరకు ఉంటే ఎడ్ల దొరకు రూ.2వేలు ఇవ్వాల్సి వస్తోంది. ట్రాక్టర్ల ద్వారా కలుపు తీత కొంత ఇబ్బందే. ఎడ్లనాగలి అయితేనే బెటర్.

– నీలం హన్మండ్లు, లక్ష్మీపూర్ రైతు

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం

- తాటిపెల్లిలో విషాదం





జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామ శివారు రైల్వే బ్రిడ్జి వద్ద జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారి పై గురువారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో ఇదే మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. తాటిపెల్లికి చెందిన జెట్టి కార్తీక్ (18), అతని స్నేహితుడు మేకర్తి రవితేజ (17) కలిసి పని నిమిత్తం రాత్రి సమయంలో జగిత్యాలకు వస్తున్నారు. చల్‌గల్ రైల్వే బ్రిడ్జి సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో కార్తీక్ అక్కడిక్కడే మృతి చెందాడు. రవితేజను జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకుని కార్తీక్ మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో బంధువులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి.

వ్యవసాయ పరిశోధనలు వేగవంతం చేయాలి



శాస్త్రవేత్తలు సాగుచేసిన పంటలను పరిశీలిస్తున్న రఘురామిరెడ్డి, తదితరులు

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ పరిశోధనలు వేగవంతం చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ రఘురామిరెడ్డి శాస్త్రవేత్తలకు సూచించారు. జగిత్యాల మండలం పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో జరుగుతున్న పరిశోధనలను బుధవారం పరిశీలించారు. శాస్త్రవేత్తల పరిశోధనలు రైతుల పోలాల్లోకి చేరాలని, రైతులకు ఉపయోగపడే పరిశోధనలకు పెద్దపీట వేయాలని, అధిక దిగుబడినిచ్చే రకాలు తయారు చేయాలని సూచించారు. పురుగులు, తెగుళ్లను తట్టుకునే రకాలను రూపొందించేందుకు ప్రయత్నించాలని తెలిపారు. పరిశోధన స్థానాల్లో అన్ని రకాల పంటలను కొద్ది విస్తీర్ణంలోనైనా సాగు చేయాలని, ఇది రైతుల సందర్శనకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రెండు గ్రామాల పేర్లు మార్పు

- తిర్మలాపూర్ మల్లన్నపేటగా..
- ఇబ్రహీంనగర్ శ్రీరాములపల్లిగా..
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



మల్లన్నపేట ఆలయం

గొల్లపల్లి: మండలంలోని తిర్మలాపూర్, ఇబ్రహీంనగర్ గ్రామాల పేర్లను మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిర్మలాపూర్‌గా కొనసాగుతున్న గ్రామంలో మల్లికార్జునస్వామి కొలువై ఉన్నారు. ఆ స్వామివారి పేరిటే గ్రామాన్ని మల్లన్నపేటగా పిలుస్తున్నారు. దీంతో మల్లన్నపేటగా అధికారికంగా గుర్తించాలని గ్రామస్తులు మంత్రి కొప్పుల ఈశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇక ఇబ్రహీంనగర్ గ్రామాన్ని పూర్వం నుంచే శ్రీరాములపల్లిగా పిలుస్తున్నారు. దీంతో ఆ గ్రామాన్ని శ్రీరాములపల్లిగా అధికారికంగా పేర్లను మార్చుతూ.. జీవో రావడంతో ఆయా గ్రామాల చిరకాల కోరిక నెరవేరినట్లయ్యింది. ఈ సందర్భంగా మంత్రికి శ్రీరాములపల్లి సర్పంచ్ నేరెల్ల గంగారెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ బోయపోతు గంగాధర్, గ్రామస్తులు, మల్లన్నపేట సర్పంచ్ సిద్దెంకి నర్సయ్య, ఎంపీటీసీ గోస్కుల రాజన్న, గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



సమ్మె నోటీసు అందిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

జగిత్యాలరూరల్: పంచాయతీరాజ్ శాఖ టెక్నికల్ వ్యవస్థలో 13ఏళ్లుగా పనిచేస్తున్న 32మంది ప్రాజెక్ట్ మేనేజర్లకు, పంచాయతీల్లో పనిచేస్తున్న 1619 మంది ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ పేస్కేలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని బుధవారం ఈ–పంచాయతీ ఆపరేటర్ల అసోసియేషన్ నాయకులు రాయికల్‌లో ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగుల సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలైన పల్లెప్రగతి, హరితహారం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, భవన నిర్మాణం, ఆస్తిమార్పిడి, వ్యాపార లైసెన్స్‌లు, నెలనెలా పనులు, ఆసరా పెన్షన్ల నమోదు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లు దళితబంధు, బీసీ బంధు, గృహలక్ష్మీ వంటివి పర్యవేక్షిస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకూ సమ్మె చేస్తామంటూ నోటీసు అందజేశారు.

జాబితాపూర్ సర్పంచ్‌కు షోకాజ్ నోటీస్

- రూ.11,08,148 రికవరీకి ఆదేశాలు

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలం జాబితాపూర్ సర్పంచ్ మమతకు విజిలెన్స్ కమిటీ నివేదిక ఆధారంగా కలెక్టర్ నుంచి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. గతంలో వివిధ పనులు చేసినట్లు బిల్లులు తీసుకున్నారని, పంచాయతీ పాలకవర్గం, ప్రజలు పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలో విజిలెన్స్ కమిటీ విచారణ చేపట్టి తుది నివేదిక సమర్పించారు. దీంతో సర్పంచ్ నుంచి రూ.11,08,148 రికవరీ చేయాలని మండల పంచాయతీ అధికారి ద్వారా నోటీసులు జారీ చేశారు.

భూషణరావుపేటలో దొంగతనం



దొంగలు ధ్వంసం చేసిన టేల

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో వేర్వేరు చోట్ల దొంగతనాలు చోటుచేసుకున్నాయని గ్రామస్తులు తెలిపారు. రాపెల్లి వేమయ్యకు చెందిన పాన్ టేలను మంగళవారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని దొంగలు ధ్వంసం చేసి అందులోని రూ.5 వేలు, ఇతర వస్తువులు ఎత్తుకెళ్లారు. దేవ అంజయ్యకు చెందిన వ్యవసాయ మోటార్‌ను ఎత్తుకెళ్లారు.

ఇరువర్గాల దాడులు.. 30 మందిపై కేసు

సారంగాపూర్: మండలంలోని పోతారం శివారు గణేశ్‌పల్లిలో రెండువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. రెండు వర్గాల్లోని 30 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. పాతకక్షలు మనసులో పెట్టుకుని మంగళవారం రాత్రి ఒక వర్గంపై మరో వర్గం వారు దాడి చేసుకున్నారు. ఇందులో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాలూ ఫిర్యాదు చేసుకోవడంతో ఒక వర్గంలోని 15 మంది, మరో వర్గంలోని 15 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఈత చెట్లు నరికిన వారిపై కేసు



తొలగించిన ఈతచెట్లు

మల్లాపూర్: మండలంలోని ముత్యంపేట శివారులో కొందరు బుధవారం ఈత చెట్లను నరికేశారు. పోలీసుల కథనం ప్రకారం.. 364 సర్వే నంబర్‌లో 2.10 ఎకరాల్లో విస్తరించిన ఈతవనంలోని చెట్లను ఆదే గ్రామానికి చెందిన ఎండీ.ఖాజాఖాన్, అతని కుమారుడు ఎండీ.ఇమ్రాన్, మరికొందరు నరికివేశారు. సుమారుగా 20 ఈతచెట్లను నరికివేయడంతోపాటు జేసీబీతో గౌడ సంఘం ఆధీనంలో ఉన్న భూమిలో కందకం తవ్వారు. గౌడ సంఘం సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని ఆందోళన చేపట్టారు. మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్, మెట్‌పల్లి ఎక్సైజ్ సీఐ రాధ తమ సిబ్బందితో అక్కడి చేరుకుని విచారణ చేపట్టారు. గౌడ సంఘం అధ్యక్షుడు గుగ్గిల్ల నర్సాగౌడ్ ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గ్రూపు–1 అభ్యర్థుల జీవితాలతో చెలగాటం

- ప్రిపరేషన్ ఖర్చు ప్రభుత్వమే భరించాలి
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: గ్రూపు–1 పరీక్షలు రద్దు చేయాలన్న కోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని, అభ్యర్థుల జీవితాలతో రాష్ట్ర సర్కారు చెలగాటం ఆడుతోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా సారంగాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ రాష్ట్రాన్ని సాధించుకున్నా.. దానిని ప్రభుత్వం విస్మరిస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియలో ప్రభుత్వ నిర్ణయాలు లోపభూయిష్టంగా ఉన్నాయన్నారు. గ్రూపు–1 పరీక్షకు మొదటిసారి ప్రశ్నపత్రాలు లీకేజీ వ్యవహారంతో రద్దు అయ్యిందని, రెండోసారి బయోమెట్రిక్ విధానం లేకుండా అభ్యర్థులను అనుమతించాలని ఎలా నిర్ణయించారని ప్రశ్నించారు. ఇంగితజ్ఞానం ఉన్న ఎవరూ ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించబోరని ఆరోపించారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ సీఎం తన పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. పరీక్షల రద్దుకు కారణమైన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను రద్దు చేసి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. పదేళ్లుగా పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న యువత కోసం తల్లిదండ్రులు లక్షలు ఖర్చు పెట్టుకున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అభ్యర్థులకు ప్రతి ఒక్కరికీ కనీసం రూ.లక్ష చొప్పున పరిహారం అందించేలా చూడాలని కోర్టుకు విజ్ఞప్తి కోరారు. ఆయన వెంట ఎంపీపీ మసర్తి రమేశ్, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్, నాయకులు కొండ్ర రాంచంద్రారెడ్డి, కొక్కు గంగారాం, వురుమల్ల లక్ష్మారెడ్డి, చేకుట శేఖర్, వురుమల్ల నగేష్‌రెడ్డి, పాలగాని మల్లేష్, కర్నె అంజిరెడ్డి, వురుమల్ల సత్యం, కాలగిరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరదకాలువలో దూకేందుకు వృద్ధురాలి ప్రయత్నం

- కాపాడిన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి



వృద్ధురాలిని సముదాయిస్తున్న బాపురెడ్డి

కథలాపూర్(వేములవాడ): మండలంలోని ఊట్‌పెల్లికి చెందిన వృద్ధురాలు సుంకరి బుచ్చమ్మ బుధవారం వరదకాలువలోకి దూకేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి గమనించి ఆమెను వారించి అడ్డుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. బుచమ్మకు సంతానం లేరు. బంధువుల వద్ద ఉంటోంది. వృద్ధాప్యం దరి చేరిన ఆమె.. ఎవరూ పట్టించుకోవడంలేదని మనస్తాపానికి గురై దుంపేట శివారు వరదకాలువ వద్దకు చేరుకుంది. కాలువలోకి దూకేందుకు ప్రయత్నించింది. ఆమెను లోక బాపురెడ్డి చూసి వాహనాన్ని ఆపి వృద్ధురాలి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెకు నచ్చజెప్పి ఇంటికి పంపించారు. ఆయన వెంట జెడ్పీటీసీ నాగం భూమయ్య, రైతు బంధు సమితి అధ్యక్షుడు బద్దం మహేందర్, గుండారపు గంగాధర్, నాగేశ్వర్ రావు, నస్కూరి భాస్కర్ ఉన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న మల్లారెడ్డి

రాయికల్: రైతుల సంక్షేమమే ధ్యేయమని సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ అయినవారికి కొత్తగా పంట రుణాలు ఇచ్చామని, దీర్ఘకాలిక రుణాల కింద రూ.40 లక్షలు అందించామని వెల్లడించారు. ఈ సీజన్ నుంచి క్రిమిసంహారక మందుల అమ్మకాలు ప్రారంభించామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సభ్యుల వాటా ధనంపై 10 శాతం డివిడెండ్ చెల్లించేందుకు ఏకగ్రీవంగా తీర్మానించారు. రైతులు చనిపోతే అంత్యక్రియల కోసం రూ.10 వేల తక్షణ సహాయం అందించాలని నిర్ణయించారు. సంఘం 2022–23కు గాను నికరలాభం రూ.1,92,08,445 సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ మార్కండేయులు, వైస్ చైర్మన్ బేతి మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు కుర్మ రాము, రమణ, నర్సింహరెడ్డి, గుండ నరేశ్, బేతి లక్ష్మీ, వసంత, భూమరాజం పాల్గొన్నారు.

విద్యార్థిని పట్ల లెక్చరర్ అసభ్య ప్రవర్తన

- కళాశాలలో చితకబాదిన విద్యార్థిని తల్లిదండ్రులు
- వివరణ ఇవ్వాలని లెక్చరర్‌కు ప్రిన్సిపల్ నోటీసు



విద్యార్థిని కాళ్లు మొక్కుతున్న అధ్యాపకుడు

జగిత్యాలక్రైం: జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న శ్రీనివాస్ అదే కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు తెలపడంతో విద్యార్థిని తల్లి కళాశాలకు చేరుకుని అధ్యాపకుడిని చితకబాదిన ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగు చూసింది. చివరకు అధ్యాపకుడు విద్యార్థిని కాళ్లు పట్టుకుని క్షమాపణ కోరాడు. సంఘటనపై ప్రిన్సిపల్ సదరు అధ్యాపకుడికి వివరణ ఇవ్వాలని నోటీసు జారీ చేశారు.

గుండెపోటుతో ఒకరి మృతి



బక్కూరి పవన్ (ఫైల్)

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌కు చెందిన ఒకరు హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బక్కూరి సత్యనారాయణ, లక్ష్మీ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు బక్కూరి పవన్ (37) సంతానం. పవన్ కొద్దిరోజులుగా భార్య పూజిత, కుమారుడుతో కలిసి హైదరాబాద్‌లోని గోల్నాకలో నివాసముంటున్నాడు. బుధవారం పవన్‌కు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగానే పరిస్థితి విషమించి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన స్వగ్రామంలోని తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు.

డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం



సమ్మెలో పాల్గొన్న జ్యోతి

వెల్గటూర్: అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండలకేంద్రంలో 17 రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు బుధవారం సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని, వీవోఏలకు బాధ్యతలు అప్పగించి సమ్మెను అణిచివేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కో–కన్వీనర్ రాజలింగు, అంగన్‌వాడీ టీచర్ల సంఘం మండల అధ్యక్షురాలు శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో చోరీ

మల్లాపూర్: మండలంలోని వాల్గొండలో పెద్దమ్మ, రేణుక ఎల్లమ్మ ఆలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తెలిసింది. ఆలయాల్లో కొంతకాలం క్రితం ఉత్సవాలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు తమ కానుకలు హుండీలో వేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. బుధవారం ఆ ఆలయాల్లోకి స్థానికులు వెళ్లగా అమ్మవారల ముక్కుపుడకలు, పుస్తెలు (రెండున్నర తులాలు), ఏడు తులాల వెండి ఆభరణాలు (కడియం, మెడలో చైన్) కనిపించలేదు. గ్రామస్తులు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆలయానికి చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఎస్సై నవీన్‌కుమార్‌కు సమాచారం అందించారు.